విత్తన శుద్ధి.. ఆరోగ్య సిద్ధి

- నారు చల్లే ముందు తప్పనిసరి
- పంటకు మేలంటున్న వ్యవసాయాధికారులు
- రైతు సేవా కేంద్రంలో అందుబాటులో మందులు

కాజులూరు: సేద్యంలో రైతులు తొలి దశ నుంచి మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవటంతో పాటు, నారుమడుల్లో విత్తనాలు చల్లే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 67 వేల ఎకరాల సాగుభూమి ఉంది. ఈ ఏడాది సుమారు 52 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నట్టు వ్యవసాయాధికారుల అంచనా. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం అధిక శాతం రైతులు పంట దమ్ములు నిర్వహిస్తూ, నారుమడులు చల్లుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ తరుణంలోనే విత్తన శుద్ధిపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయాధికారులు గ్రామల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. డివిజన్‌లో కొందరు రైతులు నారుపోసి, నాట్లు వేసే విధానాన్ని అవలంబిస్తుండగా, కొందరు రైతులు వెదజల్లు (నేరుగా వరి విత్తనాలను దడును చేసిన పొలంలో చల్లటం) విధానాన్ని చేపడుతున్నారు. ఆయా విధానాల్లోనూ తప్పనిసరిగా సుడోమోనస్ ఫ్లోరెసెస్ అను జీవ నియంత్రణ శిలీంద్రంతోనూ, ఫాస్ఫో బాక్టీరియా (పీఎస్‌పీ) అనే భాస్వరపు జీవన ఎరువుతోనూ, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా (కేఆర్‌బీ) అనే ఎరువుతో విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.


శీలలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

చేసే విధానం–ప్రయోజనాలు

సుడోమోనస్ ఫ్లోరెసెస్ అనే జీవ నియంత్రణ శిలీంద్రంతో విత్తన శుద్ధి చేస్తే వరిలో అధికంగా వచ్చే అగ్గి తెగులు, మాగుడు తెగులు, పొడ తెగులు రాకుండా 30 నుంచి 40 రోజులు పూర్తిగా రక్షణ కల్పిస్తుంది. అలాగే ఫాస్ఫో బాక్టీరియా అనే భాస్వరపు జీవన ఎరువుతో విత్తన శుద్ధి ద్వారా భూమిలో లభ్యం కాని స్థితిలో ఉండిపోయిన భాస్వరాన్ని మొక్కలకు తిరిగి లభ్యమయ్యేలా చేస్తుంది. అజో స్పైరిల్లమ్ అనే నత్రజని ఎరువుతో ఎకరానికి ఎనిమిది నుంచి 16 కిలోలకు సరిపడా నత్రజని పైరుకు అందుతుంది. ఎకరానికి సరిపడా విత్తనాలకు 500 గ్రాముల జీవన ఎరువులను బాగా పట్టించి లేదా నాట్లు వేసే ముందు నారు వేర్లను మందు ద్రావణంలో ముంచి లేదా నారుమడి లేదా వెదజల్లు పొలాల్లో చల్లాలి. అలా వీలు కాకపోతే 20 కిలోల పశువుల ఎరువులోనైనా కలిపి ఎకరం పొలంలో చల్లువచ్చు.

సత్ఫలితాలు కనిపిస్తున్నాయి



గత ఏడాది వ్యవసాయాధికారులు సూచనల మేరకే విత్తన శుద్ధి చేసి విత్తనాలు నారుమడిలో చల్లాను. మంచి ఫలితాలు కనిపించాయి. చిన్నపాటి ఈదురు గాలులు, వర్షాలకు పంట పడిపోకుండా నిలబడింది. చాలా వరకూ అగ్గితెగులు, మాగుడు తెగులు, పొడ తెగులును తట్టుకుంది.

– ద్వారంపూడి సోమిరెడ్డి, రైతు, బందనపూడి

శ్రమకు మించి ఫలితం



విత్తన శుద్ధితో రైతుకు శ్రమకు మించిన ఫలితం దక్కుతుంది. పైరు ధృడంగా పెరిగి, ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుంది. సుడోమోనస్ ఫ్లోరెసెస్, ఫాస్ఫో బాక్టీరియా, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా మందులు కేజీ/లీటరు రూ.150 చొప్పున గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నారు.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు

ముమ్మరంగా వరినాట్లు

రాయవరం: మండలంలో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జూలై 15 నుంచి ప్రారంభమైన వరినాట్లు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. జూన్, జూలై నెలల్లో ఏటా కురిసే సాధారణ వర్షాల కంటే ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో అడపాదడపా వర్షాలు కురవడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. ఇలాంటి వర్షాలు వెదజల్లు సాగుకు అడ్డంకిగా మారాయి. వెదజల్లు సాగు చేసిన రైతులకు వర్షాల కారణంగా విత్తనాలు పోగు పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా వర్షాలకు ముందు వేసిన వరి నారుమళ్లు కూడా దెబ్బతిన్నాయి.

నియోజకవర్గంలో..

క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 1.01 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ప్రస్తుత ఖరీఫ్‌లో స్వర్ణ రకాన్ని 80 శాతం, ఎంటీయూ 1061(ఇంద్ర), రబీలో విత్తనాలను సిద్ధం చేసుకోవడంలో భాగంగా ఎంటీయూ 3626(బొండాలు), ఎంటీయూ 1112, 1064, 1156 తదితర రకాలను 20 శాతం రైతులు సాగు చేస్తున్నారు. ముందుగానే బోర్లపై వరి నారుమడులను సిద్ధం చేసుకున్న రైతులు ముందుగా వరినాట్లు వేయగా, ఆ పొలాలు మూనదశలో ఉన్నాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారుగా 60 శాతం వరకు వరినాట్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు 90 శాతం వరినాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించినందున నూరు శాతం వరినాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. అదేవిధంగా రైతులు సూక్ష్మ పోషకాలకు ప్రాధాన్యమివ్వాలని చెబుతున్నారు. దీనివల్ల పంట ఏపుగా పెరగడంతో పాటు, దిగుబడి 20 నుంచి 30 శాతం పెరుగుతుందని అంటున్నారు.


వెదురుపాకలో మూన తిరిగిన చేలలో ఎరువు చల్లుతున్న కౌలు రైతు


పసలపూడిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

అసంపూర్తి రోడ్డుపై నేడు ఆందోళన

కాజులూరు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుయ్యేరు–గొల్లపాలెం రహదారి నిర్మాణంపై శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, ఈ రహదారిలో గొల్లపాలెం, కుయ్యేరు మధ్య రూ.36 కోట్ల వ్యయంతో 13 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి మూడేళ్ల క్రితం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ హయాంలో పనులు ప్రారంభించారన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్య భారీ గోతులు ఏర్పడ్డాయన్నారు. వర్షాల సమయంలో గోతులలో నీరు నిలిచిపోయి, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని శనివారం ఉదయం కాజులూరు కృష్ణుని గుడి వద్ద కుయ్యేరు, గొల్లపాలెం రహదారిపై ధర్నా నిర్వహించి, మండల అధికారులకు వినతిపత్రం సమర్పించనున్నామని తెలిపారు.

హార్బర్‌కు పరిమితమైన వేట బోట్లు

సఖినేటిపల్లి: పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌కు శుక్రవారం సముద్రంపై వేట సాగించే బోట్లు చేరుకున్నాయి. బంగాళాఖాతంలో తీవ్ర తుపాను ప్రభావంతో తలెత్తిన ప్రతికూల వాతావరణం వల్ల మత్స్యకారులు తమ బోట్లను హార్బర్‌కు చేర్చారు. ఇందులో ప్రధానంగా లోతు జలాల్లో రోజుల తరబడి వేట సాగించే సోనా బోట్లతో పాటు, ఇతర సాధారణ బోట్లు కూడా హార్బర్‌కు చేరుకున్నాయి. మత్స్య శాఖ, మెరైన్ పోలీసులు మత్స్యకారులకు ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.


పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో లంగరు వేసిన సోనా బోట్లు

మోసపూరిత హామీలతో ప్రజలకు వంచన

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ఎన్నికల మేనిఫెస్టోలో మోసపూరితమైన హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. అనంతరం ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. పట్టణంలోని ఐదో వార్డు వైఎస్సార్‌నగర్‌లో శుక్రవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ఎండగట్టారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, మోసపూరిత హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ, ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయలకు తెర తీసిందని విమర్శించారు. మద్యం స్కాం పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఆ పార్టీ నాయకులను అక్రమ అరెస్టులతో భయపెట్టాలనే ప్రయత్నం కూటమి ప్రభుత్వ నీచ రాజకీయాలకు పరాకాష్టగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినా, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. మేం అమలు చేయలేమంటూ కూటమి నాయకులు చేతులెత్తేశారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో అమలు సాధ్యంకాని హామీలను కుమ్మరించిన కూటమి నాయకులు.. వాటిని అమలు చేసే సమయం వచ్చేసరికి అసలు రూపం బయట పడిందన్నారు. కూటమి నాయకులు చేస్తున్న దారుణాలు ప్రజలకు తెలియకుండా ఉంటుందనే భ్రమతో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ, జైలుకు పంపించే కుట్రలు చేస్తుందని విమర్శించారు. వీటన్నింటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, ప్రజల తరపున వైఎస్సార్ సీపీ నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హామీలను ప్రజలకు వివరించారు. స్థానిక కౌన్సిలర్ అమలదాసు లోవరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నాయకులు పెట్టా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌నగర్‌లో ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న సూర్యప్రకాశ్

కోరవితో గోక్కుంటే..

- పెరిగిన విష సర్పాల సంచారం
- వర్షాకాలంలో పాములతో అప్రమత్తం
- ఆస్పత్రుల్లో అందుబాటులో విషం విరుగుడు ఇంజెక్షన్లు

అమలాపురం రూరల్: వివిధ ప్రాంతాల్లో పాము కాటు బాధితుల సంఖ్య పెరుగుతుంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పాముకాటుతో ప్రాణాపాయం సంభవిస్తుంది. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు, కూలీలు, ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన సమయంలో విష సర్పాలు బయటపడుతున్నాయి. కోనసీమ ప్రాంతంలో తాచు, కట్లపాము, రక్తపింజరి, జెర్రిగొడ్డు తదితర విషపూరిత పాములు ఎక్కువగా ఉన్నాయి. వాటి కాటుకు గురైన బాధితులకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు పోయిన ఘటనలూ ఉన్నాయి. అమలాపురం ఏరియా ఆసుపత్రి, ముమ్మిడివరం ప్రభుత్వ అసుపత్రితో పాటు, ఆయా నియోజకవర్గాల్లోని అన్ని పీహెచ్‌సీల్లో పాముకాటుకు చికిత్స అందుబాటులో ఉంది. ఇటీవల అమలాపురం ఏరియా ఆసుపత్రి పరిధిలో వివిధ రకాల విషసర్పాల కాటు కేసులను సకాలంలో ఆసుపత్రికి తీసుకొచ్చి, యాంటీ స్నేక్ వీనమ్ అందించటంతో ఎవ్వరికీ ప్రాణాపాయం కలగలేదు. సకాలంలో రాకపోవడం, ఇతర కారణల వల్ల చనిపోయిన కేసులూ ఉన్నాయి. ఇటీవల ముమ్మిడివరం కొత్తలంకలో పాముకాటుకు గురైన ఓ మహిళకు ముమ్మిడివరం ఆసుపత్రిలో వైద్యం అందకపోవడంతో, కాకినాడ తరలిస్తుండగా.. యానాం చేరుకునే సరికి మృతిచెందింది. అంబాజీపేటలో వారం రోజుల క్రితం పాముకాటుతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీలోని రాజుపాలెం గ్రామంలో గురువారం **ఉదయం వాకింగ్‌కు వెళ్లిన యనమదల ప్రవల్లిక(27) పాముకాటుకు గురై మరణించింది. ఇటీవల జిల్లావ్యాప్తంగా పది మంది వరకు పాముకాటుతో మృతిచెందినట్టు వైద్య వర్గాలు తెలిపాయి.**

సమయమే కీలకం

పాము కాటుకు గురైనప్పుడు వీలైనంత త్వరగా ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణపాయం నుంచి బయటపడవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు పసర మందు, నాటు వైద్యం పేరిట ప్రాణాపాయం కొనితెచ్చుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వాసుపత్రుల్లో పాము కాటుకు విరుగుడు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నా, గ్రామీణ ప్రాంతాల ప్రజలు బాధితులను పట్టణాల్లోని వైద్యశాలలకు తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో సకాలంలో వైద్యం అందక కొందరు మృత్యువాత పడుతున్నారు. పాములు సీజన్ కావటంతో ఆసుపత్రులోను, పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లను వైద్యారోగ్య శాఖ అందుబాటులో ఉంచింది.


రక్తపింజరి

పాములతో జాగ్రత్త

వర్షాలు, వరదల సీజన్ కావడంతో పాములు పొలాల నుంచి జనావాసాల్లోకి వస్తుంటాయని, వాటితో జాగ్రత్తగా ఉండాలని ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ తెలిపారు. పాముకాటు బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రాత్రి చీకట్లో పాము పిల్లలు గడ్డిలో సంచరిస్తుంటాయి. వాటిని గమనించకుండా కాలు వేయడంతో పాముకాటుకు గురవుతున్నారు. రాత్రివేళ బ్యాటరీ లైట్లు వినియోగించి, పాము పిల్లలను గుర్తించవచ్చు. పాములు పొలాలు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డివాములు, పాడుబడ్డ ఇళ్లు, ఇటుక గుట్టలు, పేర్చిన కట్టెలు, పెంట దిబ్బల్లో ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఆహారాన్వేషణలో పాములు రాత్రి సమయాల్లో బయటకు వస్తాయి. ఎలుకలు, బల్లులు, తొండలు వంటివి తినేందుకు అవి ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో తిష్ట వేస్తాయి. పాములకు చెవులు ఉండవు కాబట్టి, వాటి శరీర కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహించి సంచరిస్తుంటాయి. వేడి రక్తం ప్రవహించే ఇంతువులు, మనుషులు తారసపడితే వెంటనే గుర్తించి కాటేస్తాయి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి వాసనలను పాములు భరించలేవు. రాత్రి సమయంలో పొలాల్లో తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ల రబ్బరు బూట్లు ధరించడం మంచిది. గడ్డిలో పని చేసేవారు చేతికి రబ్బరు తొడుగులు ధరించాలి.


పామును చూపుతున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

సకాలంలో చికిత్స అందించాలి



పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళనకు గురికాకుండా చూడాలి. బాధితుడికి ధైర్యం చెప్పాలి. కాటు ఉన్న పై భాగంలో తాడుతో గట్టిగా కట్టి, శరీరంలో విషం వ్యాపించకుండా చూడాలి. కాటు ఉన్న ప్రదేశంలో పదునైన బ్లేడ్‌తో గాయం చేసి, రక్తం కారనివ్వాలి. పాముకాటుకు గురైన వ్యక్తిని నడిపించరాదు. కాలయాపన చేయకుండా తక్షణమే సమీప ఆసుపత్రికి తరలించాలి. ప్రస్తుతం ఆసుపత్రుల్లో స్నేక్ వీనమ్ యాంటీ సిరమ్ అందుబాటులో ఉన్నాయి. వెంటనే వైద్యం చేస్తే వ్యక్తి ప్రాణం కాపాడవచ్చు.

– కారెం రవితేజ, వైద్యుడు, అమలాపురం ఏరియా ఆస్పత్రి

క్లుప్తంగా

బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాల పార్కింగ్


కపిలేశ్వరపురం బస్టాండ్ వద్ద నిలిపి ఉంచిన లారీలు

కపిలేశ్వరపురం: కొందరు బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గోదావరి తీరాన ఉన్న కపిలేశ్వరపురం గ్రామానికి పలు రూట్లకు చెందిన ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుంటాయి. సర్వీసు చివరి గ్రామం కావడంతో ఆర్టీసీ వాహన సిబ్బంది బస్సును స్టాండ్‌లో ఉంచి, షెడ్యూల్ సమయానికి తిరిగి తీస్తారు. బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాలు నిలిపిఉంచడంతో ఆర్టీసీ బస్సులు ఆపడం సమస్యగా మారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి, బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్కూళ్లలో ఆర్‌జేడీ ఆకస్మిక తనిఖీ


వేగాయమ్మపేట పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

రామచంద్రపురం రూరల్: మండంలంలోని వేగాయమ్మపేట, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూళ్లను విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. వేగాయమ్మపేట పాఠశాలలో అన్నం ఉడకడం లేదని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్య లేకుండా విద్యార్థులకు భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఉపాధ్యాయులను ఆదేశించారు. వారం రోజుల తరువాత మళ్లీ తనిఖీ చేసి, తనకు నివేదిక ఇవ్వాలని ఎంఈఓ తాడి వీరరాఘవరెడ్డికి నిర్దేశించారు.

మాజీ సర్పంచ్ కొప్పిశెట్టికి మాతృ వియోగం


కొప్పిశెట్టి మహాలక్ష్మి (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ఉండూరు మాజీ సర్పంచ్, శెట్టి బలిజ సంఘ నాయకుడు కొప్పిశెట్టి ఏడుకొండలు మాతృమూర్తి కొప్పిశెట్టి మహాలక్ష్మి(85) గురువారం రాత్రి కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, శెట్టిబలిజ సంఘ పెద్దలు కట్టా సూర్యనారాయణ, నరాల ఏడుకొండలు, మాజీ సర్పంచ్ దంగేటి మంగాయమ్మ తదితరులు సంతాపం ప్రకటించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరంలో ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన వేద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని సరస్వతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద నిర్వహించే ఈ శిబిరంలో వెన్నుముక, ఎముకలు, స్త్రీల సమస్యలపై పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు ఇస్తారన్నారు. అవసరం మేరకు ఉచితంగా మందులను అందజేస్తారన్నారు. రూ.3 వేల విలువైన ఎముక సాంద్రత పరీక్షను ఉచితంగా చేస్తారన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సలాది

కాజులూరు: గ్రామానికి చెందిన సలాది వీరబాబు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ మాధవ్ నుంచి ఉత్వర్వులు అందినట్టు వీరబాబు తెలిపారు. సుమారు 15 ఏళ్లుగా పార్టీ, అనుబంధ సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.

జిల్లా కార్యవర్గ సభ్యుడిగా తోరం

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన పీఎంపీ వైద్యుడు తోరం రాము బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కమిటీ నుంచి ఉత్తర్వులందినట్టు శుక్రవారం ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ మండల కన్వీనర్‌గా వ్యవహరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కపిలేశ్వరపురం: నేలటూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యురాలు రుద్రాక్షుల వీరగౌరీకుమారితో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ.66.62 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంక్, 2,500 మీటర్ల పైపులైన్, 250 కుళాయిలను వినియోగంలోకి తెచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు.

విశిష్టమైనది శ్రావణ మాసం

విజయదుర్గా పీఠంలో ప్రత్యేక పూజలు


సర్వాభరణ భూషితురాలైన విజయదుర్గా అమ్మవారు

రాయవరం: మహిళలకు ప్రీతిపాత్రమైన శ్రావణ మాసం ధార్మిక, ఆధ్యాత్మిక, శుభకార్యాలతో ముడిపడి ఉందని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులకు ఉద్బోధించారు. మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణ శుక్రవార పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పీఠాన్ని సందర్శించారు. పీఠంలోని భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ పన్నెండు మాసాల్లో శ్రావణ మాసం ఎంతో విశిష్టమైనదన్నారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారికి పురోహితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, సహస్రనామాలతో అర్చన చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠంలోని భక్తులకు విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మండలంలో పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. రాయవరం, సోమేశ్వరం, వెంటూరు, చెల్లూరు తదితర ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే పలువురు మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో.. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు


ప్రత్యేకాలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో మహిళలు శ్రావణ శుక్రవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మండలంలోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించుటకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్ పీజీలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 29 సాయంత్రం ఐదులోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలన్నారు. 31న ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, నెట్, స్లెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. వివరాలకు 7995875308, 9949135863 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

చించినాడ నుంచి బస్సు సౌకర్యం

రాజోలు: దిండి–చించినాడ వంతెన మరమ్మతులు పురస్కరించుకుని పాలకొల్లు, భీమవరం ప్రాంతాలకు చించినాడ గ్రామం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించామని రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ధనమ్మ శుక్రవారం తెలిపారు. అమలాపురం నుంచి దిండి చెక్‌పోస్టు వరకు బస్సులు నడుస్తాయన్నారు. వంతెన అవతల చించినాడ గ్రామం నుంచి ప్రతి 45 నిముషాలకు పాలకొల్లు, భీమవరం ప్రాంతాలకు బస్ సర్వీసులు సిద్ధంగా ఉంటాయన్నారు.